క్లుప్తంగా

నేడు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ఖాళీగా ఉన్న 71 సీనియర్ రెసిడెంట్ పోస్టులను ఏడాది కాలానికి భర్తీ చేసేందుకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీలో పీజీ చదివిన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని, ఇతర జిల్లాల వారికి రెండో ప్రాధాన్యత ఇస్తామన్నారు. జనరల్ మెడిసిన్ 3, గైనకాలజీ 2, రేడియాలజీ 3, ఎమర్జెన్సీ మెడిసిన్ 9, రేడియోథెరపీ 1, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ 1, అనాటమి 6, ఫిజియాలజీ 4, బయోకెమిస్ట్రీ 4, ఫార్మకాలజీ 6, పాథాలజీ 6, మైక్రోబయాలజీ 4, ఫోరెన్సిక్ మెడిసిన్ 4, కమ్యూనిటీ మెడిసిన్ 6, కార్డియాలజీ 1, ఎండోక్రైనాలజీ 1, గ్యాస్ట్రో ఎంట్రాలజీ 1, న్యూరాలజీ 1, సీటీవీఎస్ 1, ప్లాస్టిక్ సర్జరీ 1, పీడియాట్రిక్ సర్జరీ 1, యురాలజీ 1, న్యూరోసర్జరీ 1, నెఫ్రాలజీ 1, సర్జికల్ ఆంకాలజీ 1, మెడికల్ ఆంకాలజీ 1 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు www.kurnoolmedicalcollege.ac.in లో చూడాలన్నారు.

28న ఫార్మాసిస్టు యూనియన్ సమావేశం

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ ఫార్మాసిస్టు యూనియన్ జిల్లా సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.ప్రభాకర్‌రెడ్డి, ఎ.రమేష్ గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించనున్న ఈ సమావేశంలో నూతన ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.సమావేశానికి ఏపీ జేఏసీ కర్నూలు జిల్లా చైర్మన్ సీహెచ్.వెంగల్‌రెడ్డి, ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరిరెడ్డి హాజరవుతారని, ఫార్మాసిస్టులందరూ పాల్గొనాలను కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): వేర్‌హౌస్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం రేడియో స్టేషన్ సమీపంలోని వేర్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆగడాలపై పోరాడాలని కార్మికులకు సూచించారు. సమావేశంలో నాయకులు ఓబులేశు, మల్లికార్జున ఎల్లప్ప, రమేష్, హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.

1న శ్రీకూర్మ జయంతి వేడుకలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: నల్లగుట్ట శ్రీ హరి కూర్మ క్షేత్రంలో జూన్ 1న శ్రీకూర్మ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు క్షేత్ర ప్రచార సమన్వయకర్త ఏజీ నరేష్ తెలిపారు. గురువారం ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో వేడుకల ప్రచార పోస్టర్లను ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పరి మండలం హాలిగేర గ్రామంలో స్వయంభుగా వెలసిన నల్లగుట్ట శ్రీకూర్మ క్షేత్రంలో పదిళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు ప్రముఖ స్వామీజీలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో ధార్మి క సంస్థల ప్రతినిధులు లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి, కందాల రామాచార్యులు, డాక్టర్ లక్కిరెడ్డి అమర సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు హరీష్‌బాబు, శేషు యాదవ్, యుగంధర్‌శెట్టి, మనోహర్‌రావు, రాజశేఖర్‌రావు, ప్రతాప్‌రెడ్డి, నాగరాజు, గిరిబాబు, చంద్రమోహన్, రంగస్వామి, లక్ష్మీదేవి, అరుణబాయ్ పాల్గొన్నారు.

గణపతి సచ్చిదానంద జన్మదిన వేడుకలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయం గురుదత్త పీఠంలో గురువారం శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక పూజల్లో భాగంగా మొదటి రోజు విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా, అన్నమయ్య కీర్తనల ఆలాపన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతో ఉపాధి

- జిల్లాలో 550కి పైగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు
- 3 వేల మందికి ఉపాధి



నూడుల్స్ తయారు చేస్తున్న దృశ్యం



ఫాస్ట్‌ఫుడ్ తింటున్న ఆహార ప్రియులు

కర్నూలు (రూరల్): కాలానుగుణంగా ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. గతంలో ఇంటి తిండికే పరిమితమైన వారు నేడు చిరు తిళ్లకు అలవాటు పడుతున్నారు. సాయంత్రం సరదాగా కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వచ్చి హాట్..హాట్‌గా నూడుల్స్, గోబి తదితర ఫాస్ట్‌ఫుడ్‌ల రుచి చూస్తున్నారు. ఒకప్పుడు మెట్రో నగరాలకు పరిమితమైన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ప్రస్తుతం పల్లెల్లో సైతం వెలిశాయి. కొందరు యువత వీటినే ఉపాధి మార్గాలుగా వెతుక్కుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

రోజుకు రూ.10 లక్షల వ్యాపారం

రోడ్డు సైడు, రెస్టారెంట్లు, దాబాల్లో ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు జిల్లాలో సుమారు 550 వరకు ఉన్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఒక్కో సెంటర్‌లో 3 నుంచి 10 రకాల ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేసిన ప్రదేశాలను బట్టి ధరలున్నాయని, ప్రతి రోజు లక్ష మందికిపైగా ఫాస్ట్‌ఫుడ్ తింటున్నారని, ఒక్కో సెంటర్‌లో రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు వ్యాపారం జరుగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ప్రకారం రోజుకు జిల్లాలో రూ.10 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతుంది.

వంట మాస్టర్లు నేపాలీయులే..

ఇక్కడి యువత ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేసుకుంటున్నా.. వంట మాస్టర్లను మాత్రం నేపాలీయులనే పెట్టుకుంటున్నారు. ఫాస్ట్‌ఫుడ్ తయారీలో ఇక్కడి వారి కంటే వారే బాగా చేస్తారనేది ప్రజల నమ్మకం. ఏ వంటనైనా 15 నిమిషాల్లో కస్టమర్స్ ముందే తయారు చేసి ఇచ్చేస్తారు. ఉన్నత చదువులు చదువుకున్నా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో నిరుత్సాహ పడకుండా స్వయం ఉపాధి కోసం సెంటర్లను ఏర్పాటు చేసుకుని, తమతో పాటు ముగ్గురు నుంచి ఐదుగురికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారు 3 వేల మందికిపైగా యువత ఉపాధి పొందుతున్నారు.

ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో లభించే పదార్థాలు..!

ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఆహారపు ప్రియుల కోసం నోరూరించే వంటకాలను తయారు చేస్తుంటారు. ప్రధానంగా గోబీ, గోబీ మంచూరియా, గోబీ 65, గోబీ ఫ్రైడ్ రైస్, గోబీ చిల్లీ, న్యూడిల్స్, వెజ్ న్యూడిల్స్, ఎగ్ న్యూడిల్స్, చికెన్ న్యూడిల్స్, ఎగ్ రైస్, వెజ్ రైస్, ఎగ్ ఫ్రైడ్ రైస్ మొదలయినవి తయారు చేస్తుంటారు.

18 ఏళ్ల నుంచి సెంటర్ నడుపుతున్నా



నేను మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ఉద్యోగ ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో 18 ఏళ్ల నుంచి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నా. కరోనా సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నా.. ప్రస్తుతం వ్యాపారం బాగుంది. ఖర్చులన్నీ పోనూ నెలకు 15,000 దాక మిగులుతుంది.

– పురుషోత్తం, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు

ఇక్కడి వాతావరణం బాగుంది



మాది నేపాల్ దేశంలోని ఖాట్మండ్. నాతో మరో 20 మంది ఇక్కడికి వచ్చాం. నగరంలో పలు కూడళ్లళ ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పని చేస్తున్నాం. వేతనంతో పాటు భోజనం, వసతి సౌకర్యాలను యజమానులే కల్పిస్తున్నారు. ఇక్కడి వాతావరణం బాగుంది. కొన్ని నెలల పాటు పని చేసి తిరిగి మా ప్రాంతానికి వెళ్తాం.

– అనిల్ తాపే(నేపాలీ), ఫాస్ట్‌ఫుడ్ తయారీదారుడు

తెలంగాణ ఎంసెట్‌లో 'నారాయణ' విద్యార్థులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కాలేజీ కోర్ డీన్ పి.లింగేశ్వర్‌రెడ్డి

కర్నూలు సిటీ: తెలంగాణ ఎంసెట్‌లో తమ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంక్‌లు సాధించారని నారాయణ జూనియర్ కాలేజీల కోర్ డీన్ పి.లింగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం కాలేజీలో ఆయన అభినందించి మాట్లాడారు. అగ్రికల్చర్, ఫార్మసీలో ఐ.కరోలినా ఎవెలిన్ రాష్ట్ర స్థాయిలో 86వ ర్యాంకు, సాయి ముఖేష్ 137, పి.పంకజాక్షి 271, వై.ప్రవల్లిక 273, వై.దినేష్ 310, డి.సాహితి 326, జె.దినేష్‌రెడ్డి 366,సి.శబరేష్ 456వ ర్యాంకులు సాధించారన్నారు.ఇంజినీరింగ్‌లో జె.పవన్‌కుమార్ రెడ్డి 856,విజయతేజస్విని 1,074, ఇ.హరిణి 1,23 4, బి.విశ్వనాథ్ 1,255, ఆర్.నిహారిక 1,341, ఎ.అనుగ్య 1,362, మనోజ్‌కుమార్ 1,571వ ర్యాంకులు సాధించారన్నారు.అగ్రికల్చర్ విభా గంలో 100 లోపు ర్యాంకుల్లో ఒకటి, 500 లోపు 8, వెయ్యిలోపు 30, 2 వేల లోపు 61, 3 వేలలోపు 77, 5వేలలోపు 112 ర్యాంకులు వచ్చా యన్నారు. ఇంజినీరింగ్‌లో వెయ్యిలోపు 1, 2 వేలలోపు 10, 5 వేలలోపు 38, పది వేల లోపు 79 ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కాలేజీ డీన్ సరళ

కర్నూలు సిటీ: తెలంగాణ ఎంసెట్‌లో తమ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య జూనియర్ కాలేజీల ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. ర్యాంకర్లను గురువారం కాలేజీ డీన్‌లు బాలాజీ, సరళ, అధ్యాపక బృందం, తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో తమ విద్యా సంస్థల విద్యార్థులు వై.పూజిత మేఘన 562వ ర్యాంకు, ఎం.విశాల్ హృదయ్ 910, ఎం.వెన్నెల 1,083, ఇ.జయంత్ 1,213, ఎ.హారికాబాయి 1,245, కె.గీతిక 1,935, షేక్ షమీనా 2,024, ఎం.సుహైమా అఫ్రీన్ 2,037, ఎం.విష్ణుప్రసాద్ 2,350, బి.జయసాయి 2,436, మహతి 2,598వ ర్యాంకులు సాధించారన్నారు. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 20 వేల లోపు 64, అగ్రికల్చర్ ఫార్మసీలో 20 వేలలోపు 72 ర్యాంక్‌లు వచ్చాయన్నారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు, అందుకు అత్యుత్తమ బోధన చేసిన అధ్యాపకులను ఆయన అభినందించారు.

నేటి నుంచి చర్చి సంఘ వార్షికోత్సవాలు

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక స్టాంటన్ మెమోరియల్ తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ వార్షికోత్సవాలు ఈనెల 26, 27, 28 తేదీలలో నిర్వహిస్తున్నట్లు సంఘం జనరల్ బాడీ చైర్మన్ కె.దేవరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాలకు అంతర్జాతీయ స్పీకర్, టీవీ ప్రసంగీకులు బి.మాసిలామణి హాజరవుతున్నారన్నారు.

చెత్తాచెదారం తొలగించారు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(అగ్రికల్చర్): కలెక్టరేట్‌లోని జిల్లా నీటియాజమాన్య సంస్థ– వ్యవసాయ శాఖ కార్యాలయాల మధ్య పైకప్పు శిథిలాలు, చెత్త, చెదారాన్ని తొలగించారు. బుధవారం సాక్షిలో ‘కలెక్టర్ గారు..ఇటు చూడరూ’! శీర్షికపై ప్రచురితమైన వార్తకు జిల్లా యంత్రాంగం స్పందించింది. తాను ఆదేశించినప్పటికీ ఇంకా వ్యర్థాలు, చెత్తచెదారం అలాగే ఉండిపోవడం పట్ల కలెక్టర్ జి.సృజన ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓను ఆదేశించారు. వ్యర్థాలను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మికి సూచించారు. దీంతో ఆమె సిబ్బందితో పైకప్పు పెచ్చులు, ఇతర వర్థాలను తొలగించి శుభ్రం చేయించడంతో ఉద్యోగులకు సంతోషం వ్యక్తం చేశారు.



వ్యర్థాలను తొలగించిన దృశ్యం

అలరించిన పాటల పండుగ



పాట పాడుతున్న గాయకులు చంద్రకంటి మద్దయ్య, ప్రియాంక

కర్నూలు కల్చరల్: చంద్రాస్ ఈవెంట్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ‘పుణ్యభూమి నాదేశం నమో నమామి’ పేరుతో నిర్వహించిన పాటల పండుగ అలరించింది. ఈవెంట్స్ ఆర్గనైజర్ చంద్రకంటి మద్దయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ గాయకులు సుధారాణి, రాణి, హబీబ్, ప్రియాంక, హర్షద్, జయపాల్, మహబుబ్‌బాషా తెలుగు, హిందీ పాటలు పాడి ఆహుతులను అలరించారు. పారిశ్రామిక వేత్త టీజీ భరత్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కళాకారులకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ రోషన్‌అలీ, హనుమాన్ కళా సమితి అధ్యక్షులు హనుమంతరావు చౌదరి, కళాకారులు శాంసన్, జోనా, కిరణ్ బాబు, కటారి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రచయితకు ఎన్టీఆర్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న స్వరూప్ సిన్హా

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన రచయిత, అధ్యాపకులు డాక్టర్ బీవీ స్వరూప్ సిన్హాను ఎన్టీఆర్ శత జయంతి పురస్కారం వరించింది. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామారావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మానందం, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి తదితరులు స్వరూప్ సిన్హాకు పురస్కారం అందజేశారు.

సేవల్లో జాప్యం లేకుండా చూడండి

- విద్యుత్ శాఖ ఓఎస్‌డీ శ్రీనివాసులు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సేవల్లో జాప్యం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఓఎస్‌డీ శ్రీనివాసులు సూచించారు. గురువారం కర్నూలుకు వచ్చిన ఆయన స్థానిక అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమై మాట్లాడారు. జగనన్న కాలనీల్లో జరుగుతున్న విద్యుద్దీకరణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ చర్యలతో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా అవుతోందని, అత్యవసర, చిన్న కారణాలతో ఏర్పడే అంతరాయాలను సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. విద్యుత్ బిల్లుల వసూలులో 100 శాతం లక్ష్యం చేరాలన్నారు. వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టామని, ఇందులో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు స్తంభా, సామగ్రి సిద్ధంగా ఉందని, వీటి మంజూరులో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఏదైనా కారణాలు చూపి రైతులను పదేపదే తిప్పుకుంటూ ఉంటే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో మార్చి కొత్తది ఏర్పాటు చేయాలని, విద్యుత్ చౌర్యం, వృథాను అరికట్టి, భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. సరఫరా, సేవలు, సమస్యల పట్ల స్పందన, బిల్లుల వసూలులో ఉమ్మడి కర్నూలు జిల్లా బాగుందని, ఇదే లక్ష్యంతో పనిచేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. సమావేశంలో కన్‌స్ట్రక్షన్ ఈఈ రాజేష్, డీఈఈలు రంగస్వామి, ఎల్లప్ప, వి. విజయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేతనం రూ.272 పడేలా పనులు కల్పించాలి

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



జి.శింగవరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు దినసరి వేతనం కనీసం రూ.272 పడే లా పనులు కల్పించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి మండల అధికారులను ఆదేశించారు. గురువారం కర్నూలు మండలంలోని నిడ్జూరు, జి శింగవరం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ 6గంటలకే ఉపాధి కూలీలు ఫీల్డ్‌లో పని చేసేలా చూడాలని సూచించారు. వేసవికాలంలో గ్రామాల్లో వలసల నివారణకు కూలీల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు ఉపాధి హామీ పథకం కింద తక్కువ ఖర్చుతో చీనీ, నిమ్మ, జామ, మామిడి, సపోట, కొబ్బరి, సీతాఫలం, అల్లనేరేడు, చింత, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్, గుండె మల్లెలు, గులాబీ పూల సాగు చేపట్టి లాభాలు గడించాలని సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 100 శాతం సబ్సిడీతో తోటల పెంపకానికి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. మండల ఇంజినీర్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరలో విజయ వనం ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులో రూపుదిద్దుకుంటున్న విజయ నగర వనం పుల్లయ్య పార్క్‌ను జూన్ మొదటి వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి పల్లె శివశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పార్క్‌ను సందర్శించి అందులో జరుగుతున్న పురోభివృద్ధి పనులను పరిశీలించారు. రెండేళ్ల నుంచి రూ.90 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కిడ్స్ ప్లే ఏరియా, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ఏరియా, యోగా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.10 లక్షలతో హైటెక్ నర్సరీను అభివృద్ధి చేస్తున్నామన్నారు. డీఎఫ్ఓతో పాటు కర్నూలు రేంజర్ సూర్య చంద్రరాజు, సోషల్ ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు ఘన వీడ్కోలు





సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్) శ్రీనివాసులు (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ శ్రీనివాసులు (42) ప్రమాదవశాత్తు మృతి చెందడంతో గురువారం స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. 2004లో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం చత్తీస్‌ఘడ్‌లో పనిచేస్తున్న ఈయన హైదరాబాద్‌లో సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్‌లో భార్యపిల్లలతో కలిసి ఉంటున్నారు. సెలవుల నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి ఇంటి వద్ద విద్యుత్ మోటార్ రిపేర్ చేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సైనిక సిబ్బంది మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి పత్తికొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి భార్య శారదమ్మ, కుమార్తె భార్గవి, కుమారుడు శ్రీహరి ఉన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై. సుబ్బన్న గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల మొదటి వారం లోపు స్పాట్ బిల్లింగ్ ద్వారా డిమాండ్ నోటీసులు జారీ చేశామని, అందులో ఉన్న గడువులోపు బిల్లులు చెల్లించాలని సూచించారు. బిల్లులు ఆన్‌లైన్‌లో సులువుగా చెల్లించవచ్చని, కౌంటర్ల వద్ద గంటల సేపు వేచి ఉండే బదులు ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్, ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి సురక్షిత యాప్‌ల ద్వారా కూడా చెల్లించవచ్చని సూచించారు.

వైద్య సిబ్బందిని నియమించాలి

కర్నూలు(రూరల్): స్థానిక పాతబస్తీలోని గడియారం ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, ఏఎన్ఎం, ఆయా పోస్టులను భర్తీ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఇక్కడ అన్ని రకాల వైద్య సేవలతో పాటు ప్రసూతి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేవారని, ప్రస్తుతం గైనకాలజిస్ట్ లేకపోవడంతో చుట్టుపక్కల ఉండే గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారని ఆరోపించారు.

బాలల హక్కులు కాపాడాలి

కర్నూలు (లీగల్): బాలల హక్కులను ప్రతిజ్ఞ క్కరూ కాపాడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగశ్రీనివాసరావు సూచించారు. గురువారం ఆయన న్యాయ సేవాసదన్‌లో పోలీసు, రెవెన్యూ, జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, సంబంధిత శాఖలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేక్ హోల్డర్ డిపార్ట్‌మెంట్ల మధ్య ఆర్డినేషన్, తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, వారిని తిరిగి కుటుంబంతో కలపడం తదితర విషయాలపై చర్చించారు.

మోటారు సైకిల్‌యాత్ర నేడు కర్నూలు రాక

కర్నూలు కల్చరల్: మరో గ్రంథాలయ ఉద్యమం పేరుతో రచయిత మంచికంటి వెంకటేశ్వరరెడ్డి చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర శుక్రవారం కర్నూలు చేరుకోనున్నట్లు గ్రంథాలయాధికారి వజ్రాల గోవిందరెడ్డి తెలిపారు. ఒంగోలు నుంచి బయలుదేరి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడ ప, అనంతపురం మీదుగా యాత్ర కర్నూలు చేరుకుంటుందన్నారు. ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని, సాహిత్య, కళాభిమానులు, పాఠకులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

లైంగికదాడి కేసు నమోదు

కర్నూలు: నందికొట్కూరు మండలం నాగటూరు గ్రామానికి చెందిన నవీన్‌పై కర్నూలు మూడో పట్టణ పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నవీన్ కర్నూలులో పాల వ్యాన్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమిశెట్టి నగర్‌లోని తన బంధువుల ఇంటి వద్ద ఉన్న బాలికను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి ఈనెల 13న బలవంతంగా హైదరాబాదు, తిరుపతి తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగికదాడి చేశాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు నవీన్‌పై ఫోక్సో చట్టం మేరకు కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

మేయర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కేక్ కట్ చేస్తున్న మేయర్ రామయ్య

కర్నూలు: నగర పాలక సంస్థ ప్రథమ పౌరుడు మేయర్ బీవై రామయ్య జన్మదిన వేడుకలు గురువారం సాయంత్రం మేయర్ క్యాంపు కార్యాలయంలోఘనంగా నిర్వహించారు. మేయర్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగం పేరుతో యువకుడికి టోకరా

బేతంచెర్ల:మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడికి కర్నూలుకు చెందిన వ్యక్తి అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బు తీసుకుని మోసం చేయడంతో బాధితుడు పోలీసు స్టేషన్ ఆశ్రయించాడు. గురువారం ఎస్ఐ శివశంకర్ నాయక్ తెలిపిన వివరాలు.. అంబాపురం గ్రామానికి చెందిన గోరంట్ల గారి శివకృష్ణకు అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని 2021లో కర్నూలు పట్టణానికి చెందిన సయ్యద్ సద్దామ్ హుస్సేన్ రూ.2 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం గురించి అడిగితే అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేశాడు. చివరకు ఉద్యోగం ఇప్పించకపోవడంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, మళ్లీ పెళ్లి, మేమ్ ఫేమస్, మెంటూ, ది లిటిల్ మర్మయిడ్ , ఫాస్ట్ ఎక్స్, 2018, ది కేరళ స్టోరీ
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : బిచ్చగాడు 2, మేమ్ ఫేమస్ , మెంటూ, 2018, విరుపాక్ష,ఏలియన్స్ 2042, అన్నీ మంచి శకునములే
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, విరుపాక్ష
ఐనాక్స్ : ఫాస్ట్ ఎక్స్, మేమ్ ఫేమస్ , మళ్లీ పెళ్లి, మెంటూ, 2018, ది కేరళ స్టోరీ, గ్రే : ది స్పై హూ లవ్డ్ మీ
భరత్ కాంప్లెక్స్ : ఫాస్ట్ ఎక్స్, కస్టడీ, ది కేరళ స్టోరీ
శ్రీరామ : సింహాద్రి
రాజ్ : మళ్లీ పెళ్లి
విజయ : బిచ్చగాడు 2